భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

నందిగామటౌన్: బక్రీద్ పండుగను నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా నందిగామ పట్టణంలోని ఈద్గా వద్ద వేకువ జాము నుంచే ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొని ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ఈద్గా వద్దకు చేరుకుని ముస్లింలను ఆప్యాయంగా పలుకరిస్తూ ఆత్మీయ ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగనిరతికి నిదర్శనమన్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను, సోదరభావాన్ని ప్రతిఒక్కరు అనుసరించాలన్నారు. ముఖ్యంగా మత సామరస్యాన్ని పెంపొందిచేందుకు ప్రతిఒక్కరు తమవంతుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్‌మస్తాన్, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు షేక్ మున్నా, షేక్ యాకుబ్‌అలీ, షేక్ జాఫర్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పాములపాటి రమేష్, ఓర్సు కొండ, పోతురాజు, యరగొర్ల రామారావు, చంద్రశేఖర్,పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: మండల ప్రజలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని గౌరవరం, పోచంపల్లి, ముక్త్యాల, షేరమహ్మద్‌పేట, గండ్రాయి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రతిఒక్కరికి అనుసరణీయమైనవని ముస్లిం మత గురువు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా ఈద్గా వద్ద మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. వీరులపాడు, కొణతాలపల్లి, నరసింహారావుపాలెం, వెల్లంకితోపాటు ఆయా గ్రామాల్లో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: మండలంలోని ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పెండ్యాల, కంచికచర్ల, గొట్టుముక్కల, కీసర, గనిఆత్కూరు, పరిటాల, చెవిటికల్లు, మోగులూరు, తదితర గ్రామాల్లోని ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: బక్రీద్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పురాతనమైన జుమ్మామసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు షేక్ రహీం, అల్లాభక్షు, మహ్మద్‌ఆజాద్, షేక్ మస్తాన్ వలి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పెద్దవరం, మునగచర్ల, పల్లగిరి, కేతవీరునిపాడుతోపాటు ఆయా గ్రామాలలోని ఈద్గాల వద్దకు పెద్దసంఖ్యలో ముస్లింలు చేరుకుని మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



పేటలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



పెనుగంచిప్రోలులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నందిగామ ఈద్గా వద్ద ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: బక్రీద్ పర్వదిన వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలోని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. బలుసుపాడు రోడ్‌లోని ఈద్గాలో, పట్టణంలోని ప్రధాన మసీదు జామియా మసీదు, చెరువుబజారులోని క్యూబా మసీదు, మిట్టగూడెంలోని నూర్ మసీదు, కాయితాల బజారులోని రజా మసీదు, నాగమయ్య బజారులోని కౌసర్ మసీదు, కాకానినగర్‌లోని బిలాల్ మసీదు, నాయీ బ్రాహ్మణబజారులోని రుకియా మసీదు, తొర్రగుంటపాలెంలోని మదీనా మసీదుల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యంగా ఈద్గాలో ఇబ్రహీం మౌలానా ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ సందేశమిచ్చారు. త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉండి సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. అల్లా కోసం ఇబ్రహీం త్యాగాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అల్లాను ప్రార్థించారు. అనంతరం ముస్లింలు ఒకరికొరకు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లింనాయకులు పాల్గొన్నారు.

పలువురు నేతల ప్రార్థనలు...

బక్రీద్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితర నేతలు బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



నందిగామ ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

క్లుప్తంగా

వెండి చెంబు సమర్పణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ ఆలయానికి మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన మాదినేని నగేష్ 100 గ్రాముల మిశ్రమ వెండి చెంబును సమర్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మన్నెం నర్సయ్య చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

మసీదు కమిటీ ఎన్నిక



పెనుగంచిప్రోలు: స్థానిక పురాతన జుమ్మా మసీదు నూతన కమిటీని శనివారం మసీదు ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్‌ఆజాద్, వైస్ ప్రెసిడెంట్‌గా మీరామొహిఉద్దీన్, కార్యదర్శిగా షేక్ అక్బర్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను మతపెద్దలు ఘనంగా సత్కరించారు.

రోడ్డును కమ్మేసిన కంప చెట్లు



నందిగామరూరల్: మండలంలోని చందాపురం నుంచి కేతవీరునిపాడు వెళ్లే రహదారిలో కంప చెట్లు దట్టంగా పెరిగిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చందాపురం గ్రామ శివారులో పరిస్థితి మరింత అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఈ రహదారిలోనే వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, వ్యవసాయ కూలీలు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. కంప చెట్లు దట్టంగా పెరిగి రోడ్డును కమ్మేయడంతో రాకపోకల సమయంలో కంప చెట్లు కళ్లకు తగిలి ప్రమాదాల బారిన పడాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డు కూడా దెబ్బతినడంతోపాటు దట్టంగా పెరిగిన కంప చెట్ల కారణంగా వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలకు వెళ్లి రావాలన్నా ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంబడి ఇబ్బందిగా మారిన కంపచెట్ల తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, వాహనచోదకులు కోరుతున్నారు.

రేపు ఆలయ హుండీల లెక్కింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ హుండీల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ మండపంలో నిర్వహించనున్నట్లు ఈఓ కిషోర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ సిబ్బందితోపాటు ఆసక్తి కలిగినవారు ఈలెక్కింపులో పాల్గొనవచ్చని ఈఓ కోరారు.

పీఎం ఈజీపీ వెబ్ ఆప్షన్‌ను పునరుద్ధరించాలి

జగ్గయ్యపేట అర్బన్: మూడునెలలుగా పీఎం ఈజీపీ పోర్టల్ వెబ్‌ఆప్షన్లు ఓపెన్ కాని కారణంగా ఎంతోమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పీఎం ఈజీపీ కింద ఖాదీ గ్రామీణ పరిశ్రమకు మార్జిన్ మనీ సబ్సిడీ చెల్లిస్తున్నట్లు కేంద్ర ఎంఎస్ఈ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపిందన్నారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పేవారికి 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. అయితే ప్రస్తుతం ఈ పోర్టల్ ఓపెన్ కాకపోతుండటంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పోర్టల్ ఓపెన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మందుబాబులకు అడ్డాగా మామిడి తోటలు



అమ్మవారి మామిడి తోటలో కుప్పలుగా పోసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు



కల్యాణ మండపం అరుగులపై తాగి పడేసిన మద్యం సీసాలు

పెనుగంచిప్రోలు:మునేరు అవతల అమ్మవారి మామిడి తోటలు మందుబాబులకు అడ్డాగా మారాయి. మద్యం దుకాణాల పక్కన సిట్టింగ్ నిలిపివేయడంతో పక్కనే ఉన్న అమ్మవారి మామిడి తోటల్లో మందుబాబులు మద్యం సేవిస్తుండటంతో పాటు సీసాలు, వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు వదిలేయటంతో అవికాస్తా పెద్ద కుప్పగా మారాయి. అమ్మవారికి ఆలయానికి చెందిన మామిడి తోటలో రూ.కోట్లు వెచ్చించి షెడ్లు, కల్యాణ మండపం నిర్మించినప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. తోట చుట్టూ కంచె కూడా తీసేయడంతో మందుబాబులు ఈ ప్రాంతాన్ని తమ అడ్డాగా మార్చుకున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి మామిడితోటలో మందుబాబుల ఆగడాలపై సారించడం ద్వారా ఆలయ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

రేపు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో ఈనెల 9వ తేదీన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు విగ్రహం కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విగ్రహ కమిటీ ప్రతినిధులు పిన్నం వెంగళరావు, నోముల రఘు, పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, రవిచంద్ మాట్లాడుతూ పట్టణంలోని విజయవాడ రోడ్‌లో 11అడుగుల ఎత్తులో ఛత్రపతి శివాజీ మహరాజ్ 13అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చాముండేశ్వరి పీఠాధిపతులు శ్రీకమలానంద భారతి స్వామి, శైవక్షేత్ర పీఠాధిపతులు శ్రీశివస్వామి, గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ శ్రీరాం భరత్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు వివరించారు. విగ్రహావిష్కరణ అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో హిందూ సమ్మేళన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న విగ్రహ కమిటీ ప్రతినిధులు

ఇద్దరికి తీవ్రగాయాలు

నందిగామ టౌన్: ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని చందాపురం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల హేమంత్, మనోజ్ ద్విచక్ర వాహనంపై పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కెవీఆర్ కళాశాల సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేసే క్రమంలో చందర్లపాడు మండలం కొత్తపాలెం వెళ్తున్న కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న హేమంత్, మనోజ్ తీవ్రంగా గాయపడటంతో వారిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం క్షతగాత్రులను విజయవాడ తరలించారు.

యోగాంధ్ర పోస్టర్ ఆవిష్కరణ

నందిగామరూరల్: క్రమశిక్షణ కలిగిన జీవన విధానానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం యోగాంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ప్రతిఒక్కరూ యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరు క్రమం తప్పకుండా యోగా చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏవో శివరామకృష్ణ, యోగాగురువు గాడిపర్తి సీతారామ్, యోగాంధ్ర కోఆర్డినేటర్లు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్టుషాపులు

- స్టిక్కర్ వేసి మరీ అధిక ధరలకు విక్రయాలు..
- ఒక్కో బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు
- మందుబాబుల జేబులు గుల్ల

కంచికచర్ల: కూటమి ప్రభుత్వ పాలనలో కంచికచర్ల మండలంలోని ప్రతి గ్రామంలో బెల్టుషాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ప్రగతి కుంటుపడగా..బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు మాత్రం మూడుపువ్వులు..ఆరుకాయలుగా సాగుతుండటం గమనార్హం.

అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు..

గత ప్రభుత్వంలో ఎక్కడా మద్యం బెల్టుషాపుల ఊసే లేదు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్‌లు, సెబ్ అధికారులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసేవారు. అధికారపార్టీకి చెందిన వారైనా సరే కేసుల నమోదులో వెనకాడేవారు కాదు. దీంతో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా కట్టడి అయ్యేవి. మరోవైపు తెలంగాణ మద్యం విక్రయాలు, రవాణాను పూర్తిగా నిషేధించారు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో బెల్టుషాపుల ద్వారా ఉదయం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు మద్యం విక్రయాలు సాగుతూనే ఉన్నాయి.



కంచికచర్లలో 'కేసీఎల్' పేరుతో స్టిక్కర్లు వేసి బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్న మద్యంసీసాలు

స్టిక్కర్ వేసి బెల్టుషాపులకు సరఫరా..

మద్యం షాపు నిర్వాహకులు గ్రామాల్లోని బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. మద్యం బాటిళ్లపై కేసీఎల్(కంచికచర్ల) అర్థం వచ్చేలా స్టిక్కర్లు అంటించి మరీ విక్రయాలు సాగిస్తున్నారు. మద్యం బాటిల్‌కు ఎమ్మార్పీ ధరకంటే పదిరూపాయలు అదనంగా వేసి బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులు మాత్రం క్వార్టర్ బాటిల్ ధరపై అదనంగా రూ. 50లు వసూలు చేస్తూ మందుబాబుల జేబులను గుల్ల చేస్తున్నారు. అంతేకాకుండా సీలు వేసిన మద్యం బాటిళ్లు విక్రయించే బెల్టుషాపుల జోలికి వెళ్లవద్దని మద్యంషాపుల నిర్వాహకులు ఎక్సైజ్‌శాఖ అధికారులను కోరినందున, తమకు ఎటువంటి ఇబ్బంది లేదని బెల్టుషాపుల నిర్వాహకులే పేర్కొంటుండటం గమనార్హం. ఇక కూలి పనులు చేసే పురుషుల్లో అత్యధికులు తమ సంపాదనను మద్యానికే తగలేస్తుండటంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండటమే ఇందుకు కారణమని మహిళలు పేర్కొంటున్నారు.

కుటుంబాల్లో గొడవలు....

ఇటీవల కంచికచర్ల మండలం కీసర గ్రామంలోని మద్యం దుకాణం వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య తీవ్రమైన ఘర్షణ జరిగింది. ఈ గొడవపై కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నాయి. జీవనాధారం దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు వ్యక్తులు తాము సంపాదించిన సొమ్మంతా మద్యానికి తగలేస్తుండటంతో కుటుంబాల్లో గొడవలు చెలరేగుతున్నాయి. కుటుంబాల మధ్య ఇంతటి చిచ్చుకు కారణమైన బెల్టుషాపుల తొలగింపునకు ఎక్సైజ్‌శాఖ అధికారులు, ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి బెల్టుషాపుల తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

> **గ్రామాల్లో బెల్టుషాపులు లేవు..**
>
> కంచికచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఏ గ్రామంలోనూ బెల్టుషాపులు లేవు. మద్యం దుకాణాల్లోనూ ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఏగ్రామంలోనైనా బెల్టుషాపులు నడుపుతున్నట్లయితే ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – షేక్ షహనాజ్‌బేగం, ఎక్సైజ్ సీఐ, కంచికచర్ల

అలరించిన ఆపాత మధురాలు

విజయవాడ కల్చరల్: గంగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఆపాత మధురాల సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. గాయనీ గాయకులు సింధూ, రజని, మల్లీశ్వరి, కృష్ణకుమారి, వేణుగోవింద్ తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. గంగా ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకుడు గంగాధర్ మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, జయప్రభు పాల్గొన్నారు.

భక్తురాలిపై వ్యాపారుల దాడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తురాలిపై కొబ్బరికాయల వ్యాపారాలు చేసేవారు దాడికి పాల్పడిన నేపథ్యంలో వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్‌తో దుర్గగుడి ఈవో శీనానాయక్ శనివారం సమావేశమై చర్చించారు. విజయేశ్వర ఆలయ పరిసరాలు, చైనావాల్, రథం సెంటర్ పరిసరాల్లో ఉన్న ఆక్రమణదారులు భక్తులపై దాడి చేయడాన్ని తీవ్రచర్యగా భావిస్తున్నామని ఈవో పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలతో ఆలయ ప్రతిష్ఠ, భద్రతకు భంగం కలుగుతోందన్నారు. ఆక్రమణల కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, సీపీతో చర్చించి తగిన రీతిలో చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.